ప్రజాశక్తి

ఆదివారం 3 సెప్టెంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు



మత్తుతో భవిష్యత్ నాశనం : ఎస్‌పి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యార్థులు, యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎఎస్పీ కె ధీరజ్ సూచించారు. మండల కేంద్రంలోని పర్యటించి ప్రవేట్ దండకారణ్య జూనియర్ కళాశాలను అకస్మాత్తుగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలో చదువుకుని మంచి భవిష్యత్ చక్క దిద్దుకోవాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ సిఐ సిహెచ్ రుద్రశేఖర్, ఎస్ఐ ఆర్.సంతోష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి

ధరల నియంత్రణలో ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



ముంచంగిపుట్టులో ర్యాలీ చేపడుతున్న సురేంద్ర, నేతలు

సిపిఎం సమర భేరిలో నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం: అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ చేపట్టిన సిపిఎం సమర భేరి పలు గ్రామాల్లో కొనసాగింది. ఆ పార్టీ నేతలు సచివాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు.

ముంచింగిపుట్టు:స్థానిక వారపు సంతలో సిపిఎం సమరభేరిలో భాగంగా ఆ పార్టీ నేతలు సంతలో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో.సురేంద్ర మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గత 9 నెలల నుండి రేషన్ బియ్యం నిలిపి వేయడంతో మండలంలో 46 డిపోల పరిధిలోని 15,200 కార్డు దారులు బియ్యం కొనుక్కోలేని పరిస్థితి నెలకొందన్నారు. నెలకు 350 మెట్రిక్ టన్నులు కాగా, 9 నెలలకు 3150 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం బియ్యం నిలిపివేయడంతో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు. రేషన్ బియ్యం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటి సభ్యులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, ప్రజలందరికీ అంతోదయ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటి సభ్యులు జీ.నారాయణ, కే.శంకర్రావు, కె.నర్సయ్య.వి, లైకోన్, డోంబ్రు పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలోని ఎగువ శోభ పంచాయతీ కేంద్రంలో సిపిఎం నేతలు పర్యటించి సంతకల సేకరణ చేపట్టారు. పార్టీ మండల కమిటీ సభ్యులు జన్ని సుబ్బారావు, సీపీఎం రాష్ట్ర నాయకులు ధడాల. సుబ్బారావు, టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో. మోస్యలు మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఎగువశోభ గ్రామ సచివాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసా ఉపాధ్యక్షులు నగేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

పివిటిజిల సమస్యలపై నిర్లక్ష్యం

పాడేరు:అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని పివిటిజి గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రతి కుటుంబానికి అంత్యోదయ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాలికి లక్కు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంట్ల మామిడి మోదపల్లి పంచాయితీల పరిధిలో నంది గరువు, ఓనూరు గుర్రగరువు, తదితర పిటిజి గ్రామాల్లో శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పివిటిజిలు సమస్యలత అవస్థలు పడుతున్నారని తెలిపారు. వంట్లమామిడి పంచాయతీలో 676 కుటుంబాలు ఉండగా 500 కుటుంబాలు పివిటిజి కుటుంబాలే ఉన్నాయన్నారు. ఇందులో 250 మందికి మాత్రమే 35 కేజీల బియ్యం కార్డులు ఉన్నాయని తెలిపారు.మోదపల్లి పంచాయతీలో 98 శాతం పివిటిజి గ్రామాలు ఉన్నాయని, 250 కుటుంబాలు ఉంటే కేవలం 150 కుటుంబాలకు మాత్రమే అంత్యోదయ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు సతీష్, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు .


సచివాలయాల్లో వినతులు

దుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మండలంలోని కించమండ, ఖంద్రుమ్, గుంటసీమ పంచాయితీ సచివాలయాల్లో శనివారం సిపిఎం నాయకులు నిరసన చేపట్టి సచివాలయ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి డొంబు ,రాంజీ, మోహన్ దాస్, బి కోటి బాబు, కే.రామచందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ :బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసి స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేసింది. మాదల గ్రామ సచివాలయం ముందు నిరసన చేపట్టి వినతి పత్రాన్ని సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు పాంగి రామన్న సచివాలయ సెక్రటరీకి అందించారు.జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదల పంచాయతీ నాయకులు అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల మండలంలో. గేమ్మెలి సచివాలయం లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వనుగు సన్యాసిదొర, వంజారి పిన్నంనాయుడు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలన్నారు. చిన్న కొత్తూరు గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సలుగు సత్తిబాబు, చిన్నబ్బాయి, సింహాచలం .పాల్గొన్నారు

హుకుంపేట: ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల నాయకులు టి.అప్పలకొండ పడల్ డిమాండ్ చేశారు. గడికించుమండ సచివాలయ పరిది సన్యసమ్మపలెం, గడ్డిమర్రి గ్రామ సమస్యలపై సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు అంతులేకుండా పెంచుకుంటూ పోతుందన్నారు.



విసతిపత్రం ఇస్తున్న నేతలు



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

4న మండల కేంద్రాల్లో ..

ధర్నాలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స


పాడేరు:- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, జీవో నెంబర్3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, ఉద్యోగాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నిర్వహిస్తున్న సమర భేరి లో భాగంగా ఈనెల 4న పాడేరు ఏజెన్సీలోని మండల కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,అన్ని వర్గాల ఆదివాసి ప్రజలు ఈ ధర్నాల్లో పాల్గొవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలత రోజు రోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు అదుపు లేకుండా ఆకాశాన్నంటు తున్నాయన్నారు. కాయగూరలు, పప్పులు, నూనెలు అమాంతంగా పెరిగాయని తెలిపారు. గత నెల 30 నుండి సెప్టెంబర్ 1 వరకు ప్రజల వద్ద నుండి సంతకాల సేకరణ, సచివాలయాల్లో వినతులు, వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను వీటిపై కదలించేందుకు కృషి ఫలితంగా ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. ప్రజలు కదిలి వచ్చి పలుచోట్ల విద్యుత్ బిల్లులను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. ఈనెల 3న జీవో 3 పునరుద్ధరణకు నిరుద్యోగ వ్యతిరేక దినంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని, 4న మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఆకాశాన ధరలు

-పట్టించుకోని పాలకులు
-పెరిగిన ఖర్చులు, తీర్చలేని అప్పులు
-అల్లాడుతున్న మధ్య తరగతి ప్రజలు
-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జనం ఆగ్రహం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: **నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. భారాల దెబ్బకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి దాపురించింది. స్కూల్ ఫీజులు దగ్గర నుంచి ఇంటి రెంట్లు, హాస్పిటల్ ఖర్చులు, కూరగాయలు, పప్పు దినుసులు, గుడ్లు, వంట నూనెలు, నిత్యావసరాలు ధరలు అమాంతం పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఎడాపెడా ధరలు, పన్నులు, చార్జీలు భారం మోపుతున్న కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ విధానాలపై ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. రోజురోజుకి నిత్యావసర ధరలు అదుపు లేకుండా ఆకాశాన్నంటు తుండడంతో పేదలు, మధ్యతరగతి ప్రజానీకం అల్లాడి పోతున్నారు.వచ్చే ఆదాయం సంగతి పక్కన పెడితే నెల తిరిగేసరికి అప్పులతో కుటుంబాన్ని నెట్టుకు రావాల్సి వస్తుంది. పెట్రోల్, డీజిల్ ధరలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయి.




పప్పులు, ఉప్పుల నుంచి వంట నూనెలు, కూరగాయల దాకా అన్ని రేట్లు మండిపోతున్నాయి. కూరగాయల ధరలు రూ.40 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. నాన్ వెజ్ ధరలు కూడా పెరిగి పోయాయి. గతేడాది కంది పప్పు కిలో రూ.120 ఉంటే ఇప్పుడు రూ.140 నుంచి రూ.165 ఉంది. పెసర పప్పు, మినపప్పు కూడా కిలోకు రూ.20 నుంచి రూ.30 దాకా పెరిగింది. ఇంట్లో అవసరమైన ప్రతి నిత్యావసర వస్తువు ధర ఏడాదిలోనే 15 శాతం నుంచి 25 శాతం మేర పెరిగాయి. ఇంట్లో నెల అవసరాలకు యావరేజ్ రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు అవుతున్నాయి.

నిత్యావసరాల ధరలు పెరగడంతో దాని ఎఫెక్ట్ ఇంటి అద్దెల మీద కూడా పడుతోంది. డివిజన్, మండల కేంద్రాల్లో సింగిల్ బెడ్రూమ్ ఇంటికి నెలకు రూ.4 వేల నుంచి 6 వేలు ఉండగా.. అదే జిల్లా కేంద్రంలో ఏరియాను బట్టి అంతకంటే ఎక్కువే ఉంది. వీటికి అదనంగా కరెంట్ బిల్లులు కూడా ఉన్నాయి. అనారోగ్య సమస్యలు కూడా పెద్ద మొత్తంలోనే ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కరోనా తర్వాత హార్ట్ అటాక్, ఇతర అనారోగ్య సమస్యలు పెరిగి పోయాయి. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా.. హాస్పిటల్కి వెళ్ళి, ఓపీ చూపించుకుంటే రూ.300 ఖర్చు అవుతుంది. టెస్టులు, మెడిసిన్సక్కు అదనంగా పెట్టాల్సి వస్తుంది.

గుదిబండగా స్కూల్ ఫీజులు..

పేద, మధ్య తరగతి కుటుంబాలకు స్కూల్ ఫీజులు గుదిబండగా మారాయి. ప్లే స్కూల్ నుంచి ఇంటర్మీడియేట్ వరకు స్కూల్, కాలేజీని బట్టి 20 శాతం నుంచి 30 శాతం ఫీజులు పెంచారు. ఫీజులు, పుస్తకాలు, ఇతరత్రా ఖర్చులు కలిపి ఓ మాదిరి స్కూల్లో ఏడాదికి రూ.60 వేలు, కార్పొరేట్ స్కూలైతే రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఫీజు ఉంది. నిత్యవసరాలు, పెట్రోల్, డీజిల్ రేట్లను కారణంగా చూపుతూ స్కూల్ ఫీజులను పెంచారు. పుస్తకాలు, యూనిఫామ్లకు అయ్యే ఖర్చులు అదనం అవుతుంది.



ధరలు అరికట్టాలి

ధరలు, పన్నుల భారంతో ఆర్థికంగా పేదలు అల్లాడి పోతున్నారు. పెరుగుతున్న ధరలు, పన్నులు అరికట్టాలి. వచ్చే ఎన్నికల నేపథ్యంలోనే కేంద్రం గ్యాస్ సిలిండర్ పై రూ.200 తగ్గించింది. గ్యాస్ ధర రూ.800 పెంచి, రూ.200 తగ్గించి ప్రజలను మోసం చేయాలని చూస్తోంది. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్, డీజిల్ రూ.50, రూ.60కు, గ్యాస్ సిలిండర్ రూ.400కే ప్రజలకు అందించాలి. రూ.50 పైసలకు యూనిట్ కరెంటు ఉన్నదానిని ఏకంగా రూ.6 పెంచడంతో ప్రజలకు మోయలేని భారంగా మారింది.

సుధ, గృహిణి, పాడేరు

ప్రజలపై విపరీతంగా భారాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఇచ్చిన వాగ్దానాలను మరచి, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, కార్పొరేట్లకు, బడా పెట్టుబడి దారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతున్నాయి. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయి. ప్రజల జీత భత్యాలు మాత్రం పెరగడం లేదు. కనీస వేతనాలు కూడా ఇవ్వలేదు. ప్రజలకు ఉపాధి కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేసేందుకు మాత్రం వెనుకాడడం లేదు.

నిర్మల, గృహిణి, పాడేరు



ఎన్నికైన కార్యవర్గం

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం, డొంకరాయి గ్రామంలో సిఐటియు నాయకులు చింత రాంబాబు, జె.రత్నాకర్, బీవీ.రమణ సమక్షంలో శుక్రవారం జరిగిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశంలో యూనియన్ డొంకరాయి బ్రాంచి కమిటీ ఎన్నిక జరిగింది. బ్రాంచి కమిటీ అధ్యక్షులుగా టి.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.నాగేంద్రప్రసాద్, కార్యదర్శిగా జి.రమణబాబు, సంయుక్త కార్యదర్శిగా పి.నరేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శివకుమార్, కోశాధికారిగా జి.జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.రామలక్ష్మి, జి.సీతామహాలక్ష్మి, ఎం.దుర్గ, డి.పైడితల్లి, బి.జోషి, బికె.రాంబాబు, సిహెచ్.ఈశ్వరరావు, డి.నాగేశ్వరరావు, కె.బాబ్జి, కె.సింహాచలం, పి.రామసుందర్రావు, పి.కేశవరావు, కె.రఘును ఎన్నుకోవడం జరిగింది.

ఆటలు పోటీలు సమర్థవంతంగా నిర్వహించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఆడుదాం ఆంధ్రాలో కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆటలు పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ కె తాతబ్బాయిదొర ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పీడీలు, పీఈటీలు ఆయా పాఠశాలల సిబ్బందితో ఆటల పోటీలు నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరిశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ నుండి 7వ తేదీ వరకు గ్రామ సచివాలయ పరిధిలో, అక్టోబర్ 10 నుండి 15వ తేదీ వరకు మండల స్థాయిలో, అక్టోబర్ 22 నుండి 25 వరకు నియోజకవర్గస్థాయిలో ఆటల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సచివాలయ స్థాయిలో జరిగే ఆటల పోటీలు నిర్వహణకు సంబంధించి 14 ఏళ్ళ పైబడిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేలా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు, ఆశ్రమ పాఠశాలల డిప్యూటీ వార్డెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు, ఎంఇఒ తాతబ్బాయిదొర

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో తప్పులు సరి పక్కాగా జాబితాను రూపొందించడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసినట్లు చెప్పారు. ఫారం-6 ద్వారా ఓటర్ల నమోదు కొరకు 803, ఫారం-7 ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించడానికి 351, ఫారం-8 ద్వారా పేర్లు తప్పులు, ఫొటోలు తదితర సవరణ కొరకు 1152 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వై.రామవరం మండలం నుండి విఆర్.పురం మండలానికి 412 మంది ఓటర్లను బదిలీ చేయాలని విఆర్.పురం మండల తహశీల్దారు సమర్పించిన లేఖపై తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అడ్డతీగల మండలంలో 30,224 మంది ఓటర్లు, చింతూరులో 28,406 మంది, దేవీపట్నంలో 21,009 మంది, గంగవరంలో 21,367 మంది, కూనవరంలో 19,665 మంది, మారేడుమిల్లిలో 15,360 మంది, రంపచోడవరంలో 29,631 మంది, రాజవొమ్మంగిలో 31,126 మంది, విఆర్ పురంలో 18,855 మంది, వై.రామవరంలో 21,960 మంది, ఎటపాకలో 32,014 మంది ఓట్లు, వెరసి 11 మండలాలలో 2,69,617 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను సబ్ కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీట ప్రతినిధులు ఎస్.బోజ్జిరెడ్డి, శ్రీను, సిహెచ్.సంతోష్ కుమార్, మడకం ప్రసాద్, కృష్ణారెడ్డి, చిలకల సత్యనారాయణ, నక్క పెద్దబాబు, డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వివి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి, టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లు లేకపోవం వల్లే తరచూ విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని, తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షులు పాంగి జీవన్‌కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-2ని ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం సందర్శించి విద్యార్థులు, హెచ్‌ఎంతో మాట్లారి పాఠశాలలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవన్‌కృష్ణ మాట్లాడుతూ స్థానిక ఆశ్రమ బాలుర పాఠశాల-2లో 6వ తరగతి చదువుతున్న గెమ్మెలి అరవింద్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేర్చగా, తల్లిదండ్రులు సదరు విద్యార్థిని స్వగ్రామానికి తీసుకెళ్లిపోగా, అక్కడ అరవింద్ మరణించారని తెలిపారు. రెండు నెలల కాలంలో సుమారు ఐదుగురు గిరిజన విద్యార్థులు మరణించారని, హెల్త్ వర్కర్లు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐటిడిఎ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర కార్తీక్, మండల కార్యదర్శి పాంగి డేవిడ్, అధ్యక్షులు ముకుల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

రంపచోడవరం : పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా సుమారు వంద మంది జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాపోలు శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి రమణి, సారపు రాయుడు, కుర్ల రాజశేఖర్ రెడ్డి, వాసు పాల్గొన్నారు.

కొయ్యూరు : పవన్ కళ్యాణ్ 51వ పుట్టినరోజును పురస్కరించుకొని కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలో సాగిన బుజ్జిబాబు, గూడెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం 1 కిలోమీటర్ ర్యాలీ నిర్వహించారు. పేద మహిళలకు చీరలు, రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.నాగేంద్ర, సిహెచ్.సిద్దు, బి.బాలు, పురా రాజేష్, గోకిరి శీను బాబు, కొర్ర రాజు, పీటా సుధీర్ బాబు, పొట్టిక రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జీకే వీధి మండలం సీలేరులోని దుర్గాదేవి షెడ్‌లో జనసేన కార్యకర్తలు వనమల రాము, రవి తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విఆర్.పురం : పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మండలంలో జీడిగుప్ప గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జీడిగుప్ప నుండి శ్రీరామగిరి వరకు భారీ ర్యాలీ చేసి అక్కడ కేక్ కటింగ్ చేశారు. శ్రీరామగిరి, సీతంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెన్‌లు, పుస్తకాలతో కూడిన కిట్‌లు పంపిణీ చేశారు. వడ్డిగూడెంలో అంగన్వాడీ పిల్లలకు వెజ్ బిర్యానీ అందించారు. వీఆర్.పురం సంత సముదాయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అభిమానులు జన సైనికులు నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొండం గ్రామంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ మాజీ ఎంపీటీసీ దురియ సాయిబాబా, అల్లంగి రామకష్ణ అప్పారావు అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పెన్సిల్ అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆనందరావు, సన్యాసి, రామచంద్ర, పూజారి అప్పలస్వామి, మొంగు, గోపి పాల్గొన్నారు.

హుకుంపేట : మండలంలో మత్స్యపురం పంచాయతీ ఉప గ్రామంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అభిమానులు జన సైనికులు శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన వాలంటీర్స్ కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు.



విఆర్.పురం మండలంలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

సీలేరులో వినాయక ఉత్సవ రాట

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు లక్ష్మీ గణపతి సెంటర్లో వినాయక చవితి నవరాత్రుల మహోత్సవాలకు సంబంధించిన రాటను శనివారం వేశారు. బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు సతీమణి నాగమణి చేతుల మీదుగా ముహూర్తపు రాట వేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఈఈ ప్రభాకరు, సర్పంచ్ దుర్జు, కాంగ్రెస్ నాయకులు కార్య శ్రీనివాస్, వానపల్లి అప్పారావు, బొర్రా కృష్ణ, చక్కర్రావు, సదరం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాట వేస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-పాడేరు:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆల్ ఇండియా తౌహీద్ జమాత్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. దాతలందరూ స్వచ్ఛందంగా వచ్చి రక్తదానాన్ని చేశారు. మహిళలు సైతం రక్తదానం చేసి తమ మానవత దృక్పథాన్ని చాటుకున్నారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమీల్ బాషా ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఆల్ ఇండియా తహీద్ ఆధ్వర్యంలో 16వ రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. యువత రక్తదానంపై అపోహలను విడనాడాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత, ప్రమాదాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేవారం అవుతారని తెలిపారు.రక్తదాతలంతా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 80యూనిట్ రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తహీద్ జమాత్ రక్తదాన శిబిర నిర్వాహకులు అధ్యక్షులు అనిస్ అబూబకర్, కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, అబ్దుల్ బాసి, క్యాంప్ ఇంచార్జ్ సయ్యద్ సర్దార్, అమీర్ అల్లీ, డాక్టర్ రూపకళ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సూర్యారావు, గౌరీ శంకర్,జయలక్ష్మి,కోఆర్డినేటర్ లోహితస్ పాల్గొన్నారు.

వాడీవేడిగా సోషల్ ఆడిట్


ఆడిట్ చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి- అనంతగిరి:జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద స్థానిక వెలుగు కార్యలయంలో శనివారం 14వ సోషల్ ఆడిట్ వాడివేడిగా జరిగింది. మండలంలోని 2022-23 సంవత్సరంలో జరిగిన భూ అభివృద్ధి, రోడ్లు, ఇతర పనులకు సంబంధించి పూర్తి ఖర్చు వివరాలు ముఖాముఖిగా తెలియపరచవలసి ఆ దిశగా చర్యలు చేపట్ట లేదు.సోషల్ స్పెషల్ ఆడిట్ అధికారి జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి. డిఈఈ .సామ్సన్ ఆధ్వర్యన ఈ సామాజిక తనికి నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి బి. నిర్మల దేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఇఇ వేణుగోపాల్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి కనకారావు, ఎంపీడీవో ఏవివి. కుమార్, ఏపీడి బాబు, ఏపీ డి. పవన్ కుమార్, ఏపీవో .అర్జున్ పాల్గొన్నారు

సింహాద్రి అప్పన్న నిత్యాన్నదానానికి
రూ.1,00,116 వితరణ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాదానికి హైదరాబాద్‌కు చెందిన వెంకటరమణ రామలక్ష్మి దంపతులు రూ.లక్ష 116 రూపాయలు విరాళాన్ని అన్నదానం సూపరింటెండెంట్ పాలూరు నరసింహారావుకు శనివారంఅందజేశారు. ఈ సందర్భంగా విరాళదాతలకు ఆలయంలో ప్రత్యేక దర్శనాన్ని కల్పించి,తీర్థప్రసాదాలను అందజేశారు. విరాళమొత్తానికి బాండ్‌ను అందజేశారు.

రాజశేఖరరెడ్డికి ఘననివాళి


అరుకులో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలో మాజీ సిఎం రాజశేఖర్ రెడ్డి 14వ వర్థంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపిపి శెట్టి. నీలవేణి వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. మండల వైసిపి పార్టీ అధ్యక్షులు శెట్టి. ఆనంద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ .మదీనా, మాజీ కోపరేటివ్ అధ్యక్షులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ:మండల కేంద్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అరకు ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్,ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మాజీ సర్పంచ్ దినరావు, మాజీ ఎంపీటీసీలు భాస్కరరావు, సుందరరావు, మాజీ సర్పంచ్ ప్రకాష్, మాజీ వైస్ సర్పంచ్ విజయకుమార్, నాయకులు పట్నాసి కొండలరావు, రాందాస్, పరశురామ్, సంపత్, గాసి, రామన్న, కొత్తబల్లుగూడ సర్పంచ్ కొర్రా రాధిక, రమేష్, పాల్గొన్నారు.

పెదబయలు : రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షులు వి.ఆనందరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ నివాళులు అర్పించారు. స్థానిక హాస్పిటల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జడ్పీటీసీ కూడా బొంజుబాబు, మాజీ జడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, సీనియర్ నాయకుడు గంపరాయి సూరయ్య, మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, అనంతయ్య, వెంకయ్య గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.


పాడేరు:పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో వైఎస్ ఆర్ విగ్రహానికి పాడేరు శాసనసభ్యురాలు కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లోచలిపుట్టులో ట్రైకార్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో వై.ఎస్.ఆర్ చిత్రపటానికి ట్రై కార్ చైర్మన్ శతక బుల్లి బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ కిముడు విశ్వ, మాజీ మండల అధ్యక్షుడు కూడా సింహాచలం పాల్గొన్నారు.

కొయ్యూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని గుడ్డపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపిపి బడుగు రమేష్, వైస్ ఎంపిపి సూకాలమ్మ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి సత్యనారాయణ, ఎంపిటిసి సడ్డా మల్లీశ్వరి, పొదుగు సూర్యకళ్యం, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మూసిరి నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి రంపచోడవరం మండలం సొసైటీ ప్రెసిడెంట్ జల్లేపల్లి రామన్న దొర పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు పండా రామకృష్ణ, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జమ్మ, జెసిఎస్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని కేంద్ర గ్రామంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వెలుకుంపాలెంలో సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, రాజవొమ్మంగిలో పలువురు నేతలు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కేంద్ర, లాగరాయి సర్పంచులు బుసరి సత్యనారాయణ, మిరియాల గణలక్ష్మి వైసీపీ నేతలు కుశరాజు, సీహెచ్ అప్పారావు, సూరిబాబు, సచివాలయం కన్వీనర్లు టి.అనంత లక్ష్మి అనిమిరెడ్డి రాము, దువరి చిన్నారావు పాల్గొన్నారు.


సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, వానపల్లి అప్పారావు, బుజ్జి, వైసీపీ నాయకులు వెంకట్రావు బుజ్జి పాల్గొన్నారు.

కొయ్యూరు, రంపచోడవరం, రాజవొమ్మంగిలలో రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు, అభిమానులు

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతములకు గుట్టుగా గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. స్థానిక జూనియర్ కళాశాల మెయిన్ రోడ్డులో శనివారం ముందస్తు సమాచారం మేరకు శనివారం ఉదయం వాహనాలు తనిఖీలు పోలీసులు నిర్వహించారు. కారు డిక్కీలో మూడు సంచులలో 72 కేజీల గంజాయి పట్టుబడిందని స్థానిక ఎస్సై రాము వెల్లడించారు. వీరిని రిమాండ్‌కు తరలించామన్నారు


పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

హోటల్ ప్రారంభం


ప్రారంభిస్తున్న వైఎస్ ఎంపిపి

ప్రజాశక్తి- హుకుంపేట : మండల కేంద్రంలో నూతనంగా మమత శ్రీ హెూటల్ ను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గోపాల్ చికెన్ సెంటర్ అధినేత కొర్లాబు గోపాల్, మణిలతో కలిసి శనివారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ఉన్నత చదువులు చదివిన గిరిజన యువతకు ఉద్యోగాలు రాక పోవడంతో స్వయం ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు పెట్టీ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. గిరిజనులు ముందుకు వచ్చి హెూటల్ ప్రారంభించడం శుభసూచకమ అన్నారు. హెూటల్ యాజమానులు మజ్జి కొండలరావు, గన్నేరు పుట్టు మాజీ సర్పంచ్, గిరిజన మహిళ సంఘం నాయకురాలు సూడిపల్లి లక్ష్మీ ప్రమీల పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డు నిర్మాణం


ప్రొక్లెయినర్‌తో చేపడుతున్న రోడ్డు పనులు


ప్రజాశక్తి-అనంతగిరి:ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేకపోవడంతో తమ సొంత డబ్బులతో గిరిజనులు చెయ్యి చెయ్యి కలిపి రోడ్డు నిర్మాణానికి కంకణం కట్టారు. అనంతగిరి మండలం పరిధి లుంగపర్తి పంచాయతీ. నేలపాలెం, గాదరాయి గ్రామాలకు గత మూడు రోజుల నుండి రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.మెట్టవలస నుండి నేలపాలెం మీదుగా గాదరాయి వరకు రోడ్డు నిర్మించేందుకు రెండు గ్రామాల గిరిజనులు లక్ష 20 వేలు వసూలు చేశారు. ఆయా గ్రామాల గిరిజనులు రోడ్డు పనులు మొదలుపెట్టారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల గిరిజనులు అనేకసార్లు సంబంధిత మండల అధికారుల దృష్టికి విన్నవించినప్పటికీ పట్టించుకున్న నాధుడే లేకపోవడంతో ఎలాగైనా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు వచ్చిన గిరిజనులు పనులు చేపట్టారు.

నూతన పింఛన్ల పంపిణీ


పింఛను ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని ఖంర్డుమ్ పంచాయతీలో నూతనంగా వయో వృద్ధ పింఛన్లు7, వితంతువు 6, వికలాంగు పింఛన్లు 3 మంజురయ్యాయి. ఈ పింఛన్ లను శనివారం ఆ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పలు రకాల కారణాలతో పింఛన్లు మంజూరు కాకపోవడంతో ఇటీవల చేపట్టిన జగనన్న సురక్ష పథకంలో భాగంగా ధ్రువపత్రాలను మంజూరు చేసి, అర్హులైన వారికి పింఛన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి, వైసిపి నాయకులు శత్రుగున్, సహదేవ్ ,గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడబ్ల్యు మినిస్టీరియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం


అధ్యక్ష, కార్యదర్శులుఎ.వెంకటరావు, జి.జానకిరామ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపి గిరిజన సంక్షేమ శాఖ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (బోధనేతర సిబ్బంది) ఉమ్మడి విశాఖ జిల్లా అసోసియేషన్ ఎన్నికలు శనివారం జరిగింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పిఎంఆర్‌సి భవనంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ ఎంపిక చేపట్టారు. సమావేశంలో అసోసియేషన్ కార్యాచరణ, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టాల్సిన ప్రణాళిక, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.వెంకటరావు, జి.జానకిరామ్, ఉపాధ్యక్షులుగా జి.ప్రసన్నకుమార్, కోశాధికారులుగా బి.వెంకటలక్ష్మి, కె.హైమావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.శేషు, జాయింట్ సెక్రటరీగా జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా వి.జ్యోతి, కె.ప్రమీల, ప్రావీణ్య, ఎస్.వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విఎంఆర్‌డిఎ పరిధిలో..చకచకా అభివృద్ధి ప్రాజెక్టులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో


వచ్చే ఆరు నెలల్లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు విఎంఆర్‌డిఎ పరిధిలో ఆచరణ రూపం దాల్చి సందర్శకులను, విశాఖ ప్రజలను కనువిందు చేయనున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. శనివారం విఎంఆర్‌డిఎ భవనంలో అధికారులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.220 కోట్లతో వుడా పార్కులో కన్వెన్షన్ సెంటర్, 200 రూమ్‌లతో ఫైవ్ స్టార్ హోటల్, వాటర్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు అనుమతులు లభించాయని తెలిపారు. అలాగే ఎంజిఎం పార్కులో 45 మీటర్లు సముద్రంలోకి డెక్ వెళ్లేలాగ 'ఓసెన్ డెక్' నిర్మాణాన్ని రూ.7.8 కోట్లతో చేపట్టనున్నామన్నారు. పిపిపి మోడ్‌లోనే విఎంఆర్‌డిఎ పలు ప్రాజెక్టులను చేపట్టి నిర్వహణను బయటవాళ్లకు ఇవ్వనుందన్నారు.

ఎపి కార్యనిర్వాహక రాజధానిగా విశాఖను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత పలు ఇంజినీరింగ్ పనులను విఎంఆర్‌డిఎ నిర్వహించేలా పథకం రూపొందించినట్లు తెలిపారు. జగనన్న ఒక సెంటు ప్లాట్లు 83 కాలనీలలో పనులకు రూ.175 కోట్లతో తాత్కాలిక మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని, 46 లే అవుట్లలో భూమి ఇచ్చిన రైతులకు రూ.200 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తూ త్వరలో వీటిని హేండోవర్ చేస్తున్నామని అన్నారు. కైలాసగిరిలో గతంలో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.10 కోట్లతో చేపట్టిన పనులు ఆగిపోవడంతో తిరిగి తాము ఆ పనుల కోసం రూ.75 లక్షలు వెచ్చించి తెలుగు మ్యూజియాన్ని రెన్నోవేషన్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కాలంలో కైలాసగిరిని బాగా అభివృద్ధి చేశామన్నారు. రూ.35 లక్షలతో హెల్త్ ఎరీనా, వాకింగ్ ట్రాక్ బాగు చేశామన్నారు. తెన్నేటి పార్కును రూ.77 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికోసం టెండరు కూడా పిలిచామన్నారు. నగర పరిధిలో 3 వ్యూ పాయింట్లను అభివృద్ధి చేయడంతో ప్రజానీకం, సందర్శకులు సాయంత్రం వేళ సాగరతీరంలో ఆహ్లాదకరంగా గడుపుతున్నారన్నారు. విఎంఆర్‌డిఎ పరిధిలో కొత్తగా నాలుగు ప్రాజెక్టులు చేపట్టామని వెల్లడించారు. కైలాసగిరిపై కాటేజీలు, రెస్టారెంట్ నిర్మాణం రూ.18 కోట్లు వెచ్చించనున్నామన్నారు. ఓసెన్ డెక్‌ను వంద మంది సముద్రం దిగువన సమావేశం అయ్యేలాగ ముంబయి తరహాలో ఏర్పాటు చేయనున్నామన్నారు. దీంతో సందర్శకులకు కొత్త ఫీల్ విశాఖపై వస్తుందన్నారు. వైశాఖి జల ఉద్యానవనంలో రూ.22 కోట్లతో పిపిపి కింద రిక్రియేషన్ జోన్ పెడుతున్నామన్నారు. కైలాసగిరిపై రూ.5 కోట్లతో సైన్స్ సిటీని పిల్లల కోసం హైదరాబాద్ తరహాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్ఎడి వద్ద 2024 జనవరి నాటికి ఆర్‌ఒబి ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో రెండు కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి చేమలాపల్లిలో రూ.5.9 కోట్లు, ఎండాడలో రూ.6.8 కోట్లను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి చేస్తున్న పలు ప్రాజెక్టుల వద్ద డిజిటల్ టికెట్ సిస్టం ఉంటుందని తెలిపారు. విఎంఆర్‌డిఎ పరిధిలో 200 పైచిలుకు వేకెంట్ ప్లాట్స్ గుర్తించామన్నారు. వేలం కోసం ఈ-కొనుగోలు నిర్వహించగా 60 ప్లాట్లు అమ్మకానికి వచ్చాయన్నారు. రూ.51 కోట్లు ఆదాయం లభించిందని తెలిపారు. దాకమర్రి లే అవుట్‌లోని ఎల్ఐజి అన్నీ అయిపోయాయని, ఎంఐజి, హెచ్ఐజి వేలం ప్రస్తుతం నడుస్తోందని అన్నారు. విఎంఆర్‌డిఎ పరిధిలో 587 షాపులున్నాయన్నారు. సమావేశంలో విఎంఆర్‌డిఎ సెక్రటరీ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న 'నైట్ ఫుడ్ కోర్ట్'ను తక్షణం ఖాళీ చేయాలని జివిఎంసి అధికారులు నోటీసు జారీ చేయడంపై అక్కడి చిరు వ్యాపారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు వ్యాపారుల సంఘం అధ్యక్షులు నర్సింగ్ మీడియాతో మాట్లాడారు. తమ జీవనోపాధి అయిన దుకాణాలను తక్షణం ఖాళీ చేసి ఎలా బతకగలమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు అన్యాయం చేస్తే జివిఎంసి కార్యాలయం ఎదుట తమ సంఘం తరపున పెద్ద ఎత్తున ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎ.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా చంద్రమౌళి



ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గొంప చంద్రమౌళి ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యవర్గ (2023-2025) ఎన్నికలు శనివారం జరిగాయి. రొంగలి జగన్నాథం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ చైర్మన్‌గా రొంగలి జగన్నాథం, గౌరవ అధ్యక్షునిగా వి.సత్యనారాయణ, కన్వీనర్‌గా రాజాన వెంకటరావు, ఆడిటర్‌గా ఎస్.రవీంద్రనాథ్, అధ్యక్షునిగా గొంప చంద్రమౌళి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రంధి సాధురావు, కోశాధికారిగా ఆర్.నరసింగరావు, తదితరులు ఉన్నారు.

'బార్క్' భూ భాగోతం

ప్రభుత్వం మారినప్పుడల్లా కొత్త జాబితా తయారీ
తెరమీదకు కొత్త పేర్లు
అధికారుల సంతకాల్లేకుండా జాబితా విడుదల
పరిహార సొమ్ము కాజేసేందుకు పెద్దల ప్రయత్నం


బార్క్‌కు కేటాయించిన భూమి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం మారిన ప్రతిసారీ బాబా అణు విద్యుత్ పరిశోధన కేంద్రం (బార్క్) భూ పరిహార లబ్ధిదారుల జాబితా మారుతోంది. టిడిపి ప్రభుత్వంలో తయారుచేసిన జాబితాలోవున్న కొన్నిపేర్లు తాజాగా తయారుచేసిన జాబితాలో లేవు. తాజా జాబితాలోని పేర్లు ఆనాడు టిడిపి ప్రభుత్వ కాలంలో తయారుచేసిన జాబితాలో లేవు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లను తట్టుకోలేక సాగులోలేని స్థానిక, స్థానికేతరుల పేర్లు జాబితాలోకి ఎక్కినా ప్రభుత్వ యంత్రాంగం కాదనలేక మౌనంవహిస్తోంది. బార్క్‌కు కావాల్సిన కొండపోరంబోకు భూమిని అప్పగిస్తే చాలన్నట్లు అధికారులున్నారు. అచ్యుతాపురం మండలం తంతడి సర్వే నెంబరు 141, 238ల్లో బార్క్‌కు కేటాయించిన కొండపోరంబోకు భూముల్లో డి పట్టాదారులు, పేద రైతులు, వృత్తిదారులు ఎంతోకాలంగా సాగులోవున్నారు. గ్రామ సభ నిర్వహించి వీరికి పరిహారం చెల్లించేందుకు కసరత్తు చేయకుండా అందుకు భిన్నంగా వాస్తవ సాగుదారుల విస్తీర్ణం తగ్గించి, సాగులోలేని స్థానికేతరుల పేర్లతో జాబితా తయారు చేయడంతో తరచూ బార్క్ పరిహారం వివాదాస్పదమవుతోంది.

బార్క్‌కు కేటాయించిన భూములకు పరిహారం చెల్లించడానికి కొద్ది రోజుల క్రితం తయారుచేసిన సాగుదారుల జాబితా అనేక అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు సూచించిన పేర్లతో జాబితా తయారు చేశారన్న విమర్శలు ఇప్పుడు వినిపిస్తున్నట్లే టిడిపి ప్రభుత్వంలోనూ ఈ తరహా విమర్శలు వచ్చాయి. వాస్తవ సాగుదారులను గుర్తించడంలో పెరుగుతున్న రాజకీయ జోక్యంతో దాదాపు దశాబ్దమవుతున్నా పరిహారం చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. తంతడి పంచాయతీలో తంతడి, వాడపాలెం, యాతపాలెం వున్నాయి. తంతడి సర్వే నెంబరు 238లో మొత్తం 227.20 ఎకరాలకు 376 మంది పేర్లతో తాజాగా జాబితా తయారుచేశారు. సర్వే నెంబర్ 141లోని రాజానపాలెం పంచాయతీలోని రాజానపాలెం, దాసరిపాలెం, అంగవానిపాలెంకు చెందిన 121.18 ఎకరాల్లో 205 మంది డి.పట్టాదారులు, సాగుదారులు వున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అభ్యంతరాల స్వీకరణకు తంతడి గ్రామ సచివాలయంలో ప్రదర్శించినట్లు చెబుతున్న సాగుదారుల జాబితాలో అధికారి సంతకం, పేరు, స్టాంప్ లేకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ జాబితా రెవెన్యూ అధికారులు తయారుచేశారా ? స్థానిక అధికార పార్టీ నాయకులు తయారుచేసి ప్రదర్శించారా ? అన్న చర్చ జరుగుతోంది. సంబంధిత అధికారి సంతకం లేకుండా జాబితా విడుదల చేయడం వెనుక అధికార పార్టీ నాయకుల మతలబు వుందని స్థానికులు అంటున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లను తట్టుకోలేక, ప్రతిపాదనలను కాదనలేక తయారు చేస్తున్న జాబితాలతో ప్రభుత్వ యంత్రాంగం విమర్శలపాలవుతోంది. తమకు కావాల్సిన పేర్లను నమోదు చేసుకోవడంలో సర్దుబాటు చేసుకోలేక వచ్చిన స్థానిక వివాదంతో ఈ వ్యవహారం మరోసారి బయటకు వచ్చింది. సాగులోలేరని కొంతమంది డి పట్టాదారులను జాబితా నుంచి తొలగించి, తమకు కావాల్సిన వారి పేర్లు చేర్చుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే సాగులోలేని పలుకుబడి కలిగిన నాయకుల పేర్లు, బినామీల పేర్లు జాబితాలోకి ఎక్కినట్లు తెలిపారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి

బార్క్‌లో భూములు కోల్పోయిన వారితో పాటు భూమిపై ఆధారపడి బతుకుతున్న వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి. గ్రామ సభ ద్వారా వాస్తవ సాగుదారులను గుర్తించాలి. సచివాలయంలో జాబితా ప్రదర్శించిన విషయం గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేయాలి. అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చి, తుది జాబితా తయారుచేయాలి. పేదలు, వృత్తిదారులకు అన్యాయం జరగకుండా పరిహార జాబితా తయారుచేయాలి.

ఆర్.రాము,
సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్

సాగుదారులందరినీ గుర్తిస్తాం

2019లో జరిగిన సర్వే ఆధారంగా సాగుదారులతో భూమిపై ఫొటోలు తీసి జాబితా తయారు చేయడమైంది. ఇంకెవరైనా వుంటే వారిని కూడా గుర్తించేందుకు జాయింట్ కలెక్టర్ కమిటీని నియమించారు. గ్రామ సభలు మూడుసార్లు నిర్వహించాం. నిబంధనల ప్రకారం సాగుదారులను గుర్తించాం. ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా సర్వే చేస్తాం.

చిన్నికృష్ణ, ఆర్‌డిఒ, అనకాపలి

4న విశాఖకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

రూ.333.56 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : కేంద్ర పోర్టులు, నౌకాయాన రవాణా, ఆయుష్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో ఈ నెల 4న రూ.333.56 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రారంభోత్సవ ప్రాజెక్టుల పనుల ఏర్పాట్లలో ఇప్పటికే నిమగ్నమయ్యారు.. రూ.33.80 కోట్ల వ్యయంతో ఆర్ 11 ప్రాంతంలో నిర్మించిన కవర్డ్ స్టోరేజ్ యార్డ్‌ను మంత్రి ప్రారంభిస్తారు. స్టాక్ యార్డుల నుంచి ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని నియంత్రించడం కోసం దీనిని నిర్దేశించారు. ఒఆర్ 1, ఒఆర్ 2, ఒఆర్ 3 బెర్తుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుడతారు. అందుకోసం రూ.167.66 కోట్లు పెట్టుబడి పెట్టారు. 20 ఎకరాల్లో నిర్మించిన ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను అందుబాటులోకి తెస్తారు. రూ.36.05 కోట్లతో దీన్ని అభివృద్ధి పరిచారు. రూ.96.05 కోట్ల వ్యయంతో విశాఖ పోర్టులో నిర్మించిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌ను ప్రారంభిస్తారు.

ఘనంగా జాతీయ సంగీత నాటకోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశం సంగీత, కళలకు అనాదిగా ప్రసిద్ధిగాంచిందని, దాన్ని తిరిగి పునరుజ్జీవం చేయడానికి విద్యా విధానంలో సంగీత, కళలను ప్రవేశ పెట్టాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. విశాఖలోని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న విఎండిఎ కళా భారతి జాతీయ సంగీత నాటకోత్సవాలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకూ, వయసుకూ సంబంధం లేదన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసిన వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్, సంస్థ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి జిఆర్‌కె.ప్రసాద్ తదితరులు ప్రముఖ వాయులీన విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యా భారతి పురస్కారం అందించారు. లక్ష రూపాయల నగదు, స్వర్ణ కమలాన్ని కూడా అందజేశారు.

వైభవ్ జ్యూయలర్స్ 'స్వర్ణకమలం' వితరణ

మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్స్ లిమిటెడ్ (వైభవ్ జ్యూయలర్స్) కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా కళలను, సంగీతాన్ని ప్రోత్సహించడంలో 18 ఏళ్లుగా తన కృషి కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి)లో జరిగే నేషనల్ ఎమినెన్స్ అవార్డ్ ఫంక్షన్‌లో 2002 నుంచి భారతదేశంలోగల ప్రఖ్యాత సంగీత కళాకారులను 'స్వర్ణకమలం'తో సత్కరిస్తూ వస్తోంది. శనివారం కూడా అలాగే తన కళాభిమానాన్ని చాటుకుంది. పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి వైభవ్ జ్యూయలర్స్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి మల్లికా మనోజ్ 'స్వర్ణకమలం' బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా సాంస్కృతిక కళలను ప్రోత్సహించడంలో వైభవ్ సహకారం కొనసాగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వాలంటీరుకు గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వైకుంఠపురం గ్రామ సమీపంలో శనివారం బైక్ అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో లబ్బర్తి వాలంటీరు వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే... లబ్బర్తి సచివాలయ వాలంటీర్ సీతారపు వెంకటరమణ ఏలేశ్వరం నుండి రాజవొమ్మంగి వైపు బైక్‌పై వస్తుండగా వైకుంఠపురం గ్రామ శివారులో రహదారిపై అదుపుతప్పి పడిపోయాడు. దీంతో వెంకటరమణ తలపై, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఆ వాహనంలో వెంకటరమణను జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల -2లో రాజేంద్రపాలెం పిహెచ్‌సి ఎఎన్ఎం టి.చెల్లయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి కె.శ్రీవాణి ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరిశీలించి సంబంధిత వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నివారణకు, జ్వరం, దురదలు గజ్జి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

ప్రత్యేక న్యాయస్థానం ఎపిపిగా గోవిందరావు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇంజరాన గోవిందరావు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ సెషన్స్ కోర్టుతోపాటు గంజాయి, మత్తు మందులు అక్రమ రవాణా నిషేదిత చట్టం కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమతులయ్యారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధిత మత్తు మందులకు సంబంధించిన కేసులకు ఎపిపిగా గోవిందరావు వ్యవహరిస్తారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, పి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు రామజోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బిఎస్ లత, సీనియర్ న్యాయవాదులు ఎం రవి, శ్రీనివాసమూర్తి, కెవి రామ్మూర్తి, బగాది తులసీదాస్ అభినందించారు.

పురోగతిలో ఎకో వైజాగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఆధ్వర్యంలో ఎకో - వైజాగ్ కార్యక్రమాలు పురోగతిలో ఉన్నాయని కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ శనివారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. జూలై , ఆగష్టు నెలల్లో 63,415 రైడ్స్ నిర్వహించి 4250 కేజీల సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశామన్నారు. ఎకో క్లీన్‌లో భాగంగా 6 బీచ్ క్లీనింగ్ వాహనాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు.